సాక్షి తిరుపతి

శుక్రవారం । 5 । సెప్టెంబర్ । 2025



వితంతువుల వేదన పెంఛెన్ !
వితంతు పింఛన్లు ఇవ్వాలని బాధితులు కలెక్టరేట్‌లో నిర్వహించే గ్రీవెన్స్‌కు నెలల తరబడి తిరుగుతున్నారు. - 8లో



ఎస్వీయూకు ఐఎస్ఓ సర్టిఫికేషన్
ఎస్వీయూకు ప్రతిష్టాత్మకమైన ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్ (ఐఎస్ఓ) గుర్తింపు లభించింది. - 8లో



శ్రీసిటీని సందర్శించిన విశాఖ సెజ్ జోనల్ డీసీ
విశాఖ వీఎస్ఈజెడ్ జోనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ శ్రీ సిటీని సందర్శించారు. - 8లో

జ్వరపతి

గ్రౌండ్ రిపోర్ట్

జిల్లాను జ్వరాలు వణికిస్తున్నాయి. పల్లె ప్రాంతాలు జ్వరాల తీవ్రతతో విలవిల్లాడుతున్నాయి. ఒకే ఇంటిలో ఇద్దరూ, ముగ్గురు మంచం పట్టారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల కొరత కారణంగా జ్వర బాధితులు ప్రైవేటు ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. ఫలితంగా పేద కుటుంబాలకు ఇది అదనపు భారంగా పరిణమిస్తోంది. పల్లెలు, పట్టణాలు పారిశుద్ధ్య లోపంతో కొట్టుమిట్టాడుతున్నాయి. నివారణ చర్యలు తీసుకోవడంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. ముందస్తు వర్షాల నేపథ్యంలో అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో పంచాయతీ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు విఫలం చెందారని ప్రజలు విమర్శిస్తున్నారు.



వైద్య పరీక్షల కోసం వేచి ఉన్న జనం

- జిల్లాలో విజృంభిస్తున్న జ్వరాలు
- బాధితులతో కిక్కిరిస్తున్న ఆస్పత్రులు
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందుల కొరత
- పల్లెల్లో పడకేసిన పారిశుద్ధ్యం
- కనిపించని దోమల నివారణ చర్యలు

తిరుపతి తుడా : ప్రజలపై దోమలు దండయాత్ర చేస్తున్నాయి. పల్లెల్లో పారిశుద్ధ్యం పడకేసింది. పట్టణ ప్రాంతాల్లో దోమల నివారణ చర్యలు కనిపించడం లేదు. దీంతో ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారు. దీనికి తోడు వాతావరణ మార్పులతో జలుబు, దగ్గు వంటి సమస్యలతో సతమతం అవుతున్నారు. ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టకపోవడంతో లార్వా దశను దాటి రక్తం పీల్చేస్తున్నాయి. ఈ సారి జిల్లాలో జ్వరాలు ఆగస్టు నెల నుంచే ప్రారంభమయ్యాయి. సెప్టెంబర్, అక్టోబర్ నెలలో దోమల దండయాత్ర మరింత తీవ్రంగా ఉండే అవకాశం కనిపిస్తోంది. గత ఏడాదికి మించి ఈసారి విష జ్వరాలు విజృంభించే ప్రమాదం పొంచి ఉంది.

ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి జేబులకు చిల్లు

ప్రభుత్వ ఆస్పత్రిలో అవసరమైన మందులు లేకపోవడంతో ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రుల వైపు పరుగులు పెడుతున్నారు. జ్వరం అని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లిన బాధితులకు పారాసెట్‌మాల్ ఇచ్చి పంపుతున్నారు. సరైన వైద్యం అందకపోవడంతో తిరిగి ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం పొందుతున్నారు. అక్కడ ఒక్కొక్కరు రూ. 2 వేల నుంచి రూ.9 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. పిల్లలు , వృద్ధులకు సెలైన్ ఎక్కించే పరిస్థితులకు వెళుతోంది. దీని ద్వారా ఖర్చులు పేదలకు భారంగా మారుతున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు కొరత కారణంగా ప్రైవేటు ఆసుపత్రులకు పరుగులు పెడుతుండడంతో ప్రైవేటు ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. వివిధ రకాల పరీక్షలతో రోగులను ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యం పీల్చిపిప్పిచేస్తున్నాయి.

వాతావరణ మార్పులు కారణమే

తుపాను కారణంగా జూలై, ఆగస్టు నెలలోనూ అప్పుడప్పుడూ మోస్తరు వర్షాలు పడ్డాయి. దీని కారణంగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. సాధారణంగా అక్టోబర్, నవంబర్ నెలలో జిల్లాపై వర్షాలు ప్రభావం అధికంగా ఉంటుంది. ఈసారి రెండు నెలల ముందే వరుణుడు కరుణించడంతో ముందస్తు వర్షాలు నమోదయ్యాయి. దీని కారణంగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. చలిగాలులు వీయడం, వాతావరణం చల్లబడటం వంటి మార్పులు కారణంగా విష జ్వరాలు సోకాయి. దీనికి తోడు దోమల ప్రభావం జ్వరాల తీవ్రతను పెంచాయి.

ఫిర్యాదు చేస్తేనే ఫాగింగ్..

ప్రభుత్వం దోమలపై దండయాత్ర చేయడంలో పూర్తిగా విఫలమైంది. మే, జూన్ నెలలో దోమ లార్వా దశలో ఉంటుంది. దోమగా మారకముందే నివారణ చర్యలు చేపడితే దోమల సంతతిని అరికట్టవచ్చు. ప్రభుత్వాలు ఆ దిశగా జూన్ నెలలోపు దోమల నివారణకు పటిష్టమైన చర్యలను చేపట్టాలి. బ్లీచింగ్ , స్ప్రే , ఆయిల్ బాల్స్ ద్వారా నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో దోమల సంతతిని అరికట్టేందుకు చర్యలు చేపడుతుంటారు. ఇలాంటి చర్యలు ఎక్కడా చేపట్టకపోవడంతోనే దోమల సంతతి తీవ్రంగా వృద్ధి చెందుతోంది. మురుగు కాలువలు, కల్వర్టులు, నీళ్ల నిల్వ ఉండే ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయడం ద్వారా దోమలు వృద్ధి చెందకుండా చర్యలు చేపట్టాల్సి ఉంది. అయితే ఆ దిశగా ఎక్కడా ముందస్తు చర్యలు లేకపోవడంతోనే దోమలు విపరీతంగా వృద్ధి చెందుతున్నాయి. తద్వారా ప్రజలపై దండయాత్ర కొనసాగిస్తున్నాయి. ముఖ్యంగా తిరుపతి శ్రీకాళహస్తి వంటి పట్టణ ప్రాంతాల్లో పిచికారీ వంటి చర్యలు ఎక్కడా కనిపించడం లేదు. ఆయిల్ బాల్స్ విధానాన్ని పూర్తిగా విస్మరించారు. ఫిర్యాదులు వచ్చిన ప్రాంతాల్లో మాత్రమే ఫాగింగ్ చేపట్టి చేతులు దులుపుకుంటున్నారు. కనీసం మురుగు కాలువలు, నీటి నిల్వ ఉన్న ప్రాంతాల్లో స్ప్రే, బ్లీచింగ్ వంటివి కూడా పిచికారీ చేయలేక అధికారులు చేతులెత్తేశారు.



వైద్య పరీక్షల కోసం బారులు తీరిన జనం



మందుల కేంద్రం వద్ద క్యూ కట్టిన బాధితులు

మంచం పట్టిన పల్లెలు



జ్వరం తీవ్రం కావడంతో ఆసుపత్రి ప్రాంగణంలోనే బెంచ్ పై పడుకుని ఉన్న బాధితుడు

జిల్లా వ్యాప్తంగా విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో జ్వరాల సమస్య అధికంగా ఉంది. ఒకే ఇంట్లో ఇద్దరు, ముగ్గురు మంచం పట్టారు. ఎక్కువగా వృద్ధులు , చిన్న పిల్లలు జ్వర ప్రభావానికి లోనవుతున్నారు. పట్టణ ప్రాంతాల్లోనూ అదే పరిస్థితి కనిపిస్తోంది. ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు ప్రైవేట్ ఆసుపత్రులు జ్వర బాధితులతో కిక్కిరిసిపోతున్నాయి. జ్వరం తీవ్రం కావడంతో గొంతు ఇన్ఫెక్షన్, దగ్గు, జలుబు వంటి సమస్యలు అధికంగా ఎదురవుతున్నాయి. మాస్కులు ఎవరూ ధరించకపోవడంతో ఇది ఎక్కువ మందికి విస్తరిస్తోంది. జ్వరం సోకిన వారికి నాలుగైదు రోజుల పాటు ప్రభావం ఉంటోంది. జలుబు, దగ్గు ప్రభావం మాత్రం తీవ్రంగా ఉంటోందని వైద్యులు చెబుతున్నారు.

జ్వరాలపై నిర్లక్ష్యం వద్దు

“ జ్వరాల బారిన పడిన వెంటనే స్థానిక ప్రజా ఆరోగ్య కేంద్రాలు జిల్లా ఆసుపత్రుల్లో వైద్యులను సంప్రదించాలి. మూడు రోజులు అయినా జ్వరం తగ్గకపోతే రక్త పరీక్షలు చేయించుకోవాలి. ఆ మేరకు వైద్య సేవలను తీసుకోవాలి. జ్వరాలపై నిర్లక్ష్యం వహించవద్దు. వాంతులు, విరేచనాలు ప్రబలితే వెంటనే అక్కడి వైద్యాధికారులకు సమాచారం అందించాలి. అలాంటి ప్రాంతాల్లో వైద్య సేవలు, పరిశుభ్రతను అందించేందుకు రాపిడ్ రెస్పాన్స్ టీంలు సిద్ధంగా ఉన్నాయి.

– డాక్టర్ బాలకృష్ణ నాయక్,
జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, తిరుపతి

న్యూస్‌రీల్

నేడు తిరుపతిలో ఉపాధ్యాయ దినోత్సవం

తిరుపతి సిటీ: తిరుపతి జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించనున్నట్లు డీఈఓ కేవీఎన్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రితో పాటు కలెక్టర్, ఉన్నతాధికారులు పాల్గొని జిల్లా నుంచి ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందజేయనున్నట్లు తెలియజేశారు.

ఎస్వీయూలో ఆరుగురికి రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డులు



రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఎస్వీయూ, ఎస్పీడబ్ల్యూ అధ్యాపకులు

ఎస్వీయూలో పనిచేస్తున్న ఆరుగురు అధ్యాపకులకు రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డులు వరించాయి. ఇందులో పాపులేషన్ స్టడీస్ అండ్ సోషల్ వర్క్ విభాగం అధ్యాపకుడు టి.చంద్రశేఖరయ్య, బయో కెమిస్ట్రీ విభాగం అధ్యాపకుడు ఎం.బాలాజీ, వృక్షశాస్త్ర విభాగం అధ్యాపకుడు టి.విజయ, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ అధ్యాపకుడు వీ.సుబ్బారావు, ఈసీఈ విభాగం అధ్యాపకురాలు టి.రమశ్రీ, కెమికల్ ఇంజిగ్ విభాగం ప్రొఫెసర్ పి.అఖిల స్వతంత్ర ఉన్నారు. అలాగే ఎస్పీడబ్ల్యూ డిగ్రీ కళాశాల జువాలజీ అధ్యాపకులు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.భువనేశ్వరి దేవి ఉన్నారు. వీరు విజయవాడ వేదికగా శుక్రవారం జరిగే ఉపాధ్యాయ దినోత్సవంలో విద్యాశాఖ మంత్రి,అధికారుల చేతుల మీదుగా ఉత్తమ అవార్డులు స్వీకరించనున్నారు

ప్రతి శుక్రవారం 'మనమిత్ర' ప్రచారం



నారాయణరెడ్డి, సచివాలయాల జిల్లా అధికారి

తిరుపతి అర్బన్ : డిజిటల్ గవర్నెన్స్ పేరుతో ప్రభుత్వం మన మిత్ర వాట్సాప్ నంబర్ 95523 00009 ద్వారా సేవల వినియోగంపై ప్రతి శుక్రవారం సచివాలయ ఉద్యోగులు ఇంటింటా ప్రచారం చేయాల్సి ఉంది. ఒకవేళ శుక్రవారం ప్రభుత్వ సెలవు దినం వస్తే మరుసటి రోజు సచివాలయ ఉద్యోగులు ప్రచారం చేపట్టాలని ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చినట్లు గురువారం సచివాలయాల జిల్లా అధికారి నారాయణరెడ్డి వెల్లడించారు. మనమిత్ర వాట్సాప్ నంబర్ ద్వారానే 709 సేవలను చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. ఈ నంబర్‌ను ఎలా సద్వినియోగం చేసుకోవాలని అనే అంశంపై ఉద్యోగులు అవగాహన కల్పిస్తారని చెప్పారు. సచివాలయ ప్రచార బాధ్యతలపై రూరల్ ప్రాంతాల్లో ఎంపీడీఓ, అర్బన్ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్ పర్యవేక్షణ ఉంటుందని పేర్కొన్నారు. వివిధ రకాల పనుల కోసం కార్యాలయాలకు రావాల్సిన అవసరం లేకుండా మనమిత్ర వాట్సాప్ నంబర్ ద్వారా చేసుకునే సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు వివరించారు.

తుడా ప్లాట్ల వేలం ప్రారంభం

తిరుపతి తుడా : తుడా ఆధ్వర్యంలో స్థానిక సూరప్పకశం వద్ద సుమారు 145 ఎకరాల్లో వేసిన పద్మావతి నగర్‌లోని 277 ప్లాట్లకు సంబంధించి వేలం ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. 13వ విడత వేలంలో భాగంగా ఒక చదరపు అడుగునకు రూ.14 వేలు నిర్ణయించారు. తొలిరోజు ఎల్ఐజీ 9 ప్లాట్లు, హెచ్ఐజీ 3 ప్లాట్లు వేలంలో విక్రయించారు. ఈ వేలం ప్రక్రియ సెప్టెంబర్ 17 వరకు నిర్వహిస్తామని తుడా కార్యదర్శి డాక్టర్ శ్రీకాంత్ బాబు తెలిపారు. ఈ-వేలంలో పాల్గొనదలచిన వారు రూ.1000 రుసుం చెల్లించి ఈనెల 16లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

గురువులే మార్గనిర్దేశకులు



ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీసీ, అధికారులు

- ఎస్వీయూలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

తిరుపతి సిటీ : భావి భారతావనికి మార్గనిర్దేశకులు గురువులేనని ఎస్వీయూ వీసీ సీహెచ్ అప్పారావు కొనియాడారు. ఎస్వీయూ శ్రీనివాస ఆడిటోరియంలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి అధికారులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రసంగించారు. రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని, ఆయన ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తింపు పొంది గురుతర బాధ్యతను దేశం గర్వించేలా నిర్వహించిన మహనీయులన్నారు. అబ్దుల్ కలాం ఉపాధ్యాయుడిని క్యాండిల్ వెలుగుతో పోల్చారని, తాను కరుగుతున్నా వెలుగునిచ్చేది గురువేనని తెలిపిన విషయాన్ని గుర్తు చేశారు. వర్సిటీ సాంకేతికత పరంగా వృద్ధి చెందిందని, కృత్రిమ మేధస్సు, క్వాంటమ్ టెక్నాలజీతో మరింత అభివృద్ధి పథంలో నడిచేందుకు అడుగులు వేస్తోందన్నారు. రిజిస్ట్రార్ భూపతి నాయుడు మాట్లాడుతూ.. గురువులు నిత్య విద్యా దాతలని, గురువును దేవుడిగా సమాజం భావిస్తుందన్నారు. అనంతరం 2025 సంవత్సరానికిగాను ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన అధ్యాపకులు ఆచార్య ప్రయాగ, ఆచార్య చంద్రశేఖరయ్య, ఆచార్య నారాయణ, డాక్టర్ పద్మజ, డాక్టర్ సునీత, ఆచార్య చంద్రాయుడు, ఆచార్య జ్యోతి, ఆచార్య సరోజమ్మ, ఆచార్య నాగజ్యోతి, డాక్టర్ హేమలత రుద్రమదేవి, డాక్టర్ స్వరూప రాణి, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ రమేష్ బాబు, డాక్టర్ విజయలక్ష్మి, ఆచార్య సుబ్బారావు, ఆచార్య రమశ్రీ, ఆచార్య సుధారాణి, ఆచార్య హేమ, ఆచార్య అఖిల స్వతంత్రకు అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ ప్రొఫెసర్ సుధారాణి, ఓవీఎస్‌రెడ్డి, ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ శ్రీనివాసులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మిథున్‌రెడ్డి విడుదల కావాలని పూజలు



ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ప్లకార్డులతో నూకతోటి రాజేష్, నేతలు

నాగలాపురం : రాజకీయ కుట్రతో లిక్కర్ కేసులో రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్టు చేయడం అక్రమమని సత్యవేడు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ పేర్కొన్నారు. గురువారం పిచ్చాటూరు బైపాస్ రోడ్డులో నిరసన తెలిపారు. అనంతరం ఆంజనేయస్వామి విగ్రహం వద్ద నూకతోటి రాజేష్ మండల నేతలతో కలిసి మిథున్ రెడ్డి త్వరగా జైలు నుంచి విడుదల కావాలని పూజలు చేశారు. ఈ సందర్భంగా నూకతోటి రాజేష్ మాట్లాడుతూ.. అక్రమ కేసులతో అరెస్టు చేస్తే పార్టీ శ్రేణులు భయపడే కాలం చెల్లిపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలం దాటినా అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా జగనన్న ప్రారంభించి, పూర్తి చేసిన పనులు తామే చేసినట్లు కాలం వెలిబుచ్చుతున్నారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చలపతిరాజు, సీనియర్ నేత భానుప్రకాష్ రెడ్డి, ఎంపీపీ మోహన్, రమేష్ రాజు, మండల ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం, సూరి బాబు రెడ్డి, నాయకులు త్యాగరాజన్, మోహన్ రెడ్డి, ఏసు దాసు, ఆరుముగం రెడ్డి, విశ్వనాథం, వాసు , చెంచు బాబు, శేఖర్, గోవింద్, చంద్ర, సుబ్బరాజు పాల్గొన్నారు.

ఆర్టీసీలో పలువురికి పదోన్నతులు

తిరుపతి అర్బన్ : ఆర్టీసీలో పలువురు ఉద్యోగులకు పదోన్నతులు, బదిలీలు నిర్వహించారు. ప్రధానంగా శ్రీకాళహస్తి డీఎం మునిచంద్రకు తిరుమల డీఎంగా బాధ్యతలు అప్పగించారు. తిరుమల డీఎం విశ్వనాథ్‌ను పదోన్నతి కల్పించి తిరుపతి డిప్యూటీ సీటీఎంగా ఇచ్చారు. అలాగే మదనపల్లి ట్రాఫిక్ అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న రేవతికి శ్రీకాళహస్తి డీఎంగా ఇచ్చారు. పీలేరు డీఎం నిర్మలను తిరుపతి కార్గో ఏటీఎం బాధ్యతలు అప్పగించారు. మంగళం డిపో ఎంఎఫ్ కళాను సూళ్లూరుపేట డీఎంగా ఇచ్చారు. సూళ్లూరుపేట డీఎంను కడపకు బదిలీ చేశారు. కడప నుంచి సురేంద్రకుమార్‌ను తిరుపతి డీఎంగా నియమించారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో గురువారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 9 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 70,472 మంది స్వామివారిని దర్శించుకోగా 25,247 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.85 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. టిక్కెట్లు లేని వారికి 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

దిగజారిన ఎస్వీయూ ర్యాంకింగ్

- గతేడాది 39..నేడు 47 ర్యాకింగ్
- నాణ్యతా ప్రమాణాలు తగ్గడమే కారణమా!

తిరుపతి సిటీ : నేషనల్ ఇన్‌స్టిట్యూషన్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్) జాతీయ సంస్థ గురువారం జాతీయ స్థాయిలో ఇచ్చిన ర్యాంకింగ్‌లో ఎస్వీయూ స్థాయి గతేడాది కంటే దిగజారడం బాధాకరం. వర్సిటీలో పాలన స్తంభించిపోవడంతో పాటు పూర్తి స్థాయి వీసీని నియమించకపోవడం, వివాదాస్పద నిర్ణయాలు తీసుకుని ఇటు తాత్కాలిక అధ్యాపకులను పెద్ద ఎత్తున తొలగించడం, బోధనేతర సిబ్బందిని నిబంధనలకు విరుద్ధంగా బదిలీ చేయడం, వర్సిటీలో పెద్ద సంఖ్యలో కోర్సుల తొలగింపు, విభాగాల విలీనం వంటి నిర్ణయాలతో పాటు ఎన్ఐఆర్ఎఫ్ నిబంధనలను తుంగలో తొక్కడం కారణమంటూ వర్సిటీలో బోధన, బోధనేతర సిబ్బంది పెద్ద ఎత్తున చర్చించుకుంటున్నారు.

8 ర్యాంకులు దిగజారిపోయి

గత ఏడాది ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో ఎస్వీయూ జాతీయ స్థాయిలో 39వ ర్యాంకు సాధించి రాష్ట్ర స్థాయిలో ఓ ప్రభంజనం సృష్టించింది. కానీ 2025 ఏడాదికి వర్సిటీ పరిస్థితి 8 ర్యాంకింగులకు దిగజారిపోవడంపై వర్సిటీ అధికారులు, ఉద్యోగులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇందులో ప్రధానంగా విద్యా వ్యవస్థలో నాణ్యతా ప్రమాణాలు తగ్గిపోవడంతో పాటు, వర్సిటీలో అర్హులైన అధ్యాపకుల కొరత, నియామకాలు లేకపోవడమేనని స్పష్టమైంది. దీంతో పాటు ఆశించిన రీతిలో వర్సిటీలో క్యాంపస్ ఇంటర్వ్యూలు చేపట్టడంలో వర్సిటీ అధికారులు విఫలమయ్యారని తెలుస్తోంది.

క్లుప్తంగా

ఎస్వీయూకు ఐఎస్‌ఓ సర్టిఫికేషన్

తిరుపతి సిటీ: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం (ఎస్వీయూ)కు ప్రతిష్టాత్మకమైన ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్ (ఐఎస్‌ఓ) గుర్తింపు లభించింది. గురువారం ఎస్వీయూ శ్రీనివాస ఆడిటోరియంలో ఐఎస్‌ఓ బృందం వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడుకు ధ్రువపత్రాలను అందజేసింది. విద్యా నైపుణ్యం, స్థిరత్వం, సమగ్రాభివృద్ధి, నిబద్ధత వంటి అంశాలపై ప్రగతి సాధించిన వర్సిటీగా అంతర్జాతీయ గుర్తింపు పొంది ఉన్నత శిఖరాలను అధిరోహించిందని వర్సిటీ అధికారులు సంతోషం వ్యక్తం చేశారు. వర్సిటీ ఈ స్థాయికి చేరుకోవడంలో బోధన, బోధనేతర సిబ్బంది కృషి ఎనలేనిదని కొనియాడారు. పర్యావరణ ప్రోత్సాహకంలో ఐఎస్‌ఓ 14001, ఇంధన పొదుపు పద్ధతుల నిర్వహణలో ఐఎస్‌ఓ 50001, నాణ్యమైన విద్యాసేవలకు ఐఎస్‌ఓ 21001, అతిథి సేవలు, ఆహార భద్రత విషయంలో ఐఎస్‌ఓ 22000 గుర్తింపు లభించిందని వర్సిటీ అధికారులు తెలిపారు.

అధ్యాపకులే దేశ నిర్మాతలు



ప్రసంగిస్తున్న వీసీ జీఎస్‌ఆర్ కృష్ణమూర్తి

తిరుపతి సిటీ : అధ్యాపకులు దేశ నిర్మాతలని, వారే దేశ సంపదని ఎన్‌ఎస్‌యూ వీసీ జీఎస్‌ఆర్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. జాతీయ సంస్కృత వర్సిటీలో గురువారం సాంకేతిక విద్యతో విద్యావ్యవస్థ బలోపేతం అనే అంశంపై మూడు రోజుల పాటు జరిగిన అంతర్జాతీయ సదస్సు గురువారం ముగిసింది. అనంతరం ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. విద్యా వ్యవస్థలో టెక్నాలజీ ప్రధాన పాత్ర పోషిస్తోందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదులో వెనుకబాటు

తిరుపతి అర్బన్ : ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ-క్రాప్ నమోదు చేయడంలో బాగా వెనుకబడి ఉన్నారని, వేగవంతం చేయాలని వ్యవసాయ అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లో వ్యవసాయశాఖ జిల్లా అధికారి ప్రసాద్‌రావు, ఉద్యానశాఖ జిల్లా అధికారి దశరథరామిరెడ్డి, జిల్లా పశువైద్యాధికారి రవికుమార్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డివిజన్, మండలాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో 13.48 లక్షల సర్వే నంబర్లకు చెందిన భూముల్లో ఈ-క్రాప్ నమోదు చేయాల్సి ఉందని చెప్పారు. పంట సాగు చేసి ఉంటే చేశారని, చేయకుంటే చేయలేదని వివరాలతో పాటు పూర్తి చేయాల్సి ఉందని వెల్లడించారు. జూలై 15 నుంచి ఈ-క్రాప్ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేశారు. అయితే ఇప్పటి వరకు కేవలం 1.72 లక్షల సర్వే నంబర్లకు చెందిన భూముల్లో మాత్రమే ఈ-క్రాప్ పూర్తి చేశారని పేర్కొన్నారు. మిగిలిన 11.76 లక్షల సర్వే నంబర్లలో ఈ-క్రాప్‌ను ఈనెల 30 లోపు పూర్తి చేయాలని వెల్లడించారు. కేవలం 25 రోజుల గడువు మాత్రమే ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమాన్ని పూర్తిగా రైతు సేవా కేంద్రాల ఆధ్వర్యంలో చేపట్టాలని వివరించారు. అలాగే ప్రకృతి వ్యవసాయం సాగును మరింత విస్తరించాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామ సంఘాల ఆధ్వర్యంలో జిల్లాలో 291 గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం సాగు చేసినప్పటికీ, కొత్తగా మరో 726 పంచాయతీలను ప్రకృతి వ్యవసాయం చేయడానికి ఎంపిక చేసినట్లు స్పష్టం చేశారు. ఒక్కో పంచాయితీలో 125 మంది రైతులతో 50 హెక్టార్లల్లో ప్రకృతి వ్యవసాయం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శోభన బాబు, మైక్రో ఇరిగేషన్ జిల్లా అధికారి సతీష్, ప్రకృతి వ్యవసాయ జిల్లా మేనేజర్ షణ్ముగం పాల్గొన్నారు.

వితంతువుల వేదన పెంఛెన్!

- పింఛన్లకు వితంతువుల అగచాట్లు
- గ్రీవెన్స్‌లో అర్జీలు ఇస్తున్నా మంజూరు కానీ వైనం
- ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదంటున్న అధికారులు
- 15 నెలలుగా నిరీక్షణ
- వైఎస్సార్ పాలనలో 40–60 రోజుల్లో పింఛన్లు మంజూరు
- 11 వేల మంది వితంతువుల ఎదురుచూపులు

తిరుపతి అర్బన్ : ఇంటికి పెద్ద దిక్కుగా ఉంటున్న భర్త మృతి చెందితే..ఆ కుటుంబంలోని భార్యతో పాటు బిడ్డలు పడే కష్టాలు వర్ణనాతీతం. ఈ కష్టాన్ని గుర్తించిన దివంగత నేత వైఎస్‌ఆర్ వితంతువులైన వారికి 40 నుంచి 60 రోజుల్లో పింఛన్లు మంజూరు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అప్పటి నుంచి ఆ తర్వాత వచ్చిన సీఎంలు ఇదే పద్ధతిని అనుసరిస్తూ వచ్చారు. ప్రధానంగా వితంతు పింఛన్లకు మాత్రం ప్రత్యేక మినహాయింపు ఇచ్చి రెండు నెలల వ్యవధిలో పింఛన్లు మంజూరు చేస్తూ వస్తున్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 15 నెలలుగా ఒక్కటంటే ఒక్క వితంతు పింఛన్ మంజూరు చేయలేదు. ఈ అంశంపై వితంతులు అధికారుల చుట్టూ పింఛన్ మంజూరు చేయాలని తిరుగుతూనే ఉన్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందలేదని అధికారులు సమాధానం ఇస్తున్నారు.

జిల్లాలో 11,320 మంది వితంతులు పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నట్లు అధికారుల వద్ద లెక్కలున్నాయి. ఏడాదిన్నరగా ప్రభుత్వం నుంచి అనుమతి రాకపోవడంతో ఆరు నెలలుగా పలువురు వితంతులు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ సందర్భంగా పింఛన్ల కోసం విన్నపాలు ఇస్తున్నా ప్రయోజనం చేకూరక ఇక్కట్లు పడుతున్నారు.

న్యాయం చేయాలని కలెక్టర్‌లో విన్నపాలు

భర్త చనిపోవడంతో ఒంటరిగా మిగిలిన వితంతులు తమ బిడ్డలను ఇంటి వద్ద చూసుకునే వారు లేకపోవడంతో వారితో కలిసి కలెక్టరేట్‌లో అర్జీలను అందిస్తున్నారు. తమకు న్యాయం చేయాలని తమ గోడును కనిపించిన అధికారికల్లా విన్నవిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని వాపోతున్నారు. ప్రతి సోమవారం పదుల సంఖ్యలో వితంతులు పింఛన్ల కోసం అర్జీలు ఇస్తున్నారు. క్షేత్రస్థాయిలో సచివాలయాలు, మండల స్థాయిలో ఎంపీడీఓల వద్ద మొరపెట్టుకున్నా ఉపయోగం లేకపోవడంతో ఇటీవల కాలంలో అంతా కలెక్టరేట్‌కు క్యూ కడుతున్నారు. అయితే అధికారులు మాత్రం అర్జీలను తీసుకుంటున్నారు. ప్రభుత్వం నుంచి అనుమతి రావాలని చెబుతున్నారు. ఎప్పుడు అనుమతి వస్తాయో తెలియడం లేదు. 2023 డిసెంబర్ 1 నుంచి 2024 అక్టోబర్ 31 వరకు ఏ కేటగిరిలోనైనా పింఛన్లు తీసుకుంటూ భర్త మృతి చెందితే మాత్రమే వారి సతీమణులకు పింఛన్లు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. వారు 6 వేల మందికి పైగా ఉంటే అందులో 4 వేల మందికి మాత్రమే అందించారు. అందులోనూ మెలిక పెట్టడంతో ఎందరో పింఛన్లు రాక బిక్కుబిక్కుమంటూ జీవనం గడుపుతున్నారు.

పింఛన్ ఇప్పించి ఆదుకోండి



ఈమె పేరు రేణుక. భర్త మోహన్‌రాజ్ గుండెపోటుతో పది నెలల కిందట మృతి చెందాడు. ఇద్దరు బిడ్డలున్నారు. తిరుపతి నగరంలోని ఎస్‌బీఐ కాలనీలో చిన్నపాటి అద్దె ఇంటిలో నివాసం ఉంటోంది. ఆమెకు కన్న (13) అనే కుమారుడు, చామంతి(8) అనే కుమార్తె ఉన్నారు. అంతేకాకుండా ఆమెతో పాటు తమ తల్లి విజయమ్మ ఉంటోంది. నలుగురు జీవనం సాగించాల్సి ఉంది. ఏ ఆధారం లేదు. ఆమెకు వితంతు పింఛన్ ఇవ్వకపోవడంతో తమ బిడ్డలతో కలిసి పదే పదే కలెక్టరేట్‌లో అర్జీలు ఇస్తున్నారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో బతుకు ప్రశ్నార్థకంగా మారింది.

– తమ ఇద్దరు బిడ్డలతో కలెక్టరేట్‌లో రేణుక, తిరుపతి

సాయం చేయండి



ఈమె పేరు షబినా, శ్రీకాళహస్తి పట్టణంలోని కుమారస్వామి వీధి ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. భర్త మృతి చెందాడు. తమ చిన్న బిడ్డతో కలిసి కలెక్టరేట్‌కు వచ్చి వితంతు పింఛన్ ఇప్పించండి అంటూ తిరుగుతున్నారు. తమకు ఏ ఆధారం లేకపోవడంతో ఇటు పింఛన్ లేకపోవడంతో కష్టాలు పడుతున్నానంటూ తమ గోడును వినిపిస్తోంది. అయితే అధికారులు మాత్రం ప్రభుత్వం నుంచి అనుమతి రాలేదంటూ చెప్పి పంపేస్తున్నారు.

– పురిటి బిడ్డతో కలెక్టరేట్‌లో షబినా, శ్రీకాళహస్తి పట్టణం

ఇద్దరు బిడ్డల పోషణ భారంగా ఉంది



ఈమె పేరు ఉయ్యాల ధనమ్మ, ఓజిలి మండలం కరబల్లవోలు గ్రామం. ఆమె భర్త అనారోగ్య సమస్యలతో మృతి చెందాడు. ఆమెకు దీక్షిత, అకిరా నందన్ అనే ఇద్దరు బిడ్డలు ఉన్నారు. గ్రామానికి వచ్చి విచారణ చేపట్టండి. అన్ని విధాల పింఛన్‌కు అర్హురాలును అంటూ విలపిస్తోంది. ఏ ఆధారం లేదు. వితంతు పింఛన్ ఇప్పిస్తే ఆ డబ్బులతో ఇద్దరి బిడ్డలను పోషించుకుంటానని గురువారం కలెక్టరేట్ వద్ద కలెక్టర్‌ను కలవడానికి తమ ఇద్దరి బిడ్డలతో వచ్చి తమ గోడు వినిపించారు.

– తమ ఇద్దరు బిడ్డలతో కలెక్టరేట్‌లో ఉయ్యాల ధనమ్మ, ఓజిలి మండలం, కరబల్లవోలు గ్రామం

ప్రభుత్వం నుంచి అనుమతి రావాల్సి ఉంది



వితంతుల పింఛన్ల మంజూరు చేయడానికి ప్రభుత్వం నుంచి అనుమతి రావాల్సి ఉంది. వచ్చిన వెంటనే తెలియజేస్తాం. అప్పుడు మాత్రమే వితంతులు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. స్పౌజ్ పింఛన్లు మాత్రమే ఇస్తున్నాం. జిల్లాలో తీసుకునే నిర్ణయం కాదు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇస్తే వెంటనే ప్రక్రియను మొదలు పెడుతాం.

– శోభనబాబు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్

కష్టాల్లో రైతులు

- ఎరువులు, యూరియా కోసం బారులు
- రైతు పక్షాన నిలబడి వాస్తవాలు వెలుగులోకి తెస్తే సాక్షిపై కేసులా?
- పచ్చ పత్రికల్లోనూ యూరియా లేదని ప్రచురితం కాలేదా?
- చంద్రబాబు, పవన్‌కు మాజీ మంత్రి ఆర్కేరోజా సూటి ప్రశ్న



సాక్షి దినపత్రిక వచ్చిన కథనాన్ని చూపుతూ మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆర్కేరోజా

నగరి : ప్రస్తుత పాలనలో రాష్ట్ర వ్యాప్తకంగా రైతులు అష్టకష్టాలు పడుతున్నారని మాజీ మంత్రి ఆర్కేరోజా అన్నారు. రైతులు పడుతున్న కష్టాలపై గురువారం నగరిలోని తన నివాసం వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎరువులకు, యూరియా కోసం రైతులు పడుతున్న బాధలు చెప్పనలవికావన్నారు. సరిచెయ్యాల్సిన ముఖ్యమంత్రి, వ్యవసాయశాఖ మంత్రి వారి చేతకాని తనాన్ని వాస్తవాలు బయటపెట్టే సాక్షిపై చూపిస్తున్నారన్నారు. క్యాబినెట్ మీటింగ్ పెట్టుకొని ఫేక్‌ల పని పడతాం అంటూ నిస్సిగ్గుగా మాట్లాడుతున్నారన్నారు. సాక్షిలో కథనం వచ్చిన రోజునే పచ్చ పత్రికల్లో యూరియా ఏదయ్యా, యూరియా వెతలు అంటూ కథనాలు వచ్చాయని ఇది అవాస్తవమైతే ఆ పత్రికలపై ఎందుకు కేసులు పెట్టడం లేదన్నారు. కుప్పం, పిఠాపురం నియోజకవర్గంల్లోనూ రైతులు ఎరువుల కోసం రైతులు బారులు తీరుతున్నారని, దీనికి చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ సిగ్గుపడాలన్నారు. రైతులకు రూ.25 వేలు ఇస్తానని చెప్పిన మీరు 15 నెలల పాలనలో ఇచ్చింది రూ.5 వేలే అన్నారు. ఇది రైతులను మోసం చేయడం కాదా అన్నారు.

ఎర్రచందనం కేసులో ఇద్దరికి జైలు

తిరుపతి లీగల్ : ఎర్ర చందనం దుంగలను అక్రమంగా తరలిస్తున్న కేసులో ఇద్దరికి ఐదేళ్ల చొప్పున జైలుశిక్ష, ఒక్కొక్కరికి 3 లక్షల రూపాయల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి రాష్ట్ర ఎర్ర చందనం కేసుల విచారణ సెషన్స్ జడ్జి ఏ. నరసింహమూర్తి గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు..2018 జూన్ 4వ తేదీ అర్ధరాత్రి వెదురుకుప్పం పోలీసులు పచ్చికాపల్లం, తిరుపతి రోడ్డు వద్ద తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో రెండు వాహనాలను పోలీసులు ఆపారు. అయితే వాహన డ్రైవర్లు పారిపోవడానికి ప్రయత్నించగా పోలీసులు కొంత మందిని పట్టుకున్నారు. వారిలో సత్యవేడు మండలం రాజుగుంటకు చెందిన మహేంద్ర, సత్యవేడు పోలీస్ క్వార్టర్స్‌కు చెందిన వెంకటేశు, మురళీశేఖర్‌ను అరెస్ట్ చేశారు. మరో ముగ్గురు పరారయ్యారు. రెండు వాహనాల నుంచి 84 ఎర్ర చందనం దుంగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు ముగ్గురిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. కేసు విచారణ దశలో మురళీశేఖర్ మృతి చెందాడు. నిందితులు మహేంద్ర, వెంకటేశులపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఇద్దరికీ శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

శెట్టిపల్లి భూసమస్యకు ఆమోదం

తిరుపతి తుడా : శెట్టిపల్లి భూ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఇటీవల వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయరెడ్డి నేతృత్వంలో అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీతో పాటు సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్, రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా సంయుక్తంగా అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి శెట్టిపల్లె భూ బాధితులకు అండగా నిలిచారు. భూ సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేశారు. లేని పక్షంలో బాధితులు, రైతులతో కలిసి ఉద్యమాన్ని తీవ్ర తరం చేస్తామని హెచ్చరించారు. ఈ క్రమంలో ప్రభుత్వం శెట్టిపల్లె భూ సమస్య తీవ్రతను గుర్తించి పరిష్కారానికి నిర్ణయం తీసుకుంది. అమరావతిలో గురువారం నిర్వహించిన క్యాబినెట్ సమావేశంలో భూసేకరణ బాధ్యతలను తుడాకు అప్పగిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో అఖిలపక్ష నేతలు హర్షం వ్యక్తం చేశారు.

తుడా చేతికి 65 ఎకరాలు

శెట్టిపల్లి భూముల అభివృద్ధిలో భాగంగా 65 ఎకరాలకు తుడాకు అప్పగిస్తూ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ భూములను తుడా అభివృద్ధి చేసి తద్వారా వచ్చే ఆదాయంతో శెట్టిపల్లి ప్రాంత అభివృద్ధికి వినియోగించాల్సి ఉంది. 65 ఎకరాల్లో గతంలో అనుకున్నట్టు ఐటీ హబ్‌గా అభివృద్ధి చేస్తారా ? వెంచర్ ద్వారా ఆర్థిక వనరులను సమకూర్చుకుంటారా ? అన్నది తెలియాల్సి ఉంది.

కార్పొరేషన్‌కు మొండిచేయి

తిరుపతి అర్బన్ పరిధిలోని శెట్టిపల్లె భూ సమస్యను పరిష్కరిస్తూ 2023 డిసెంబర్ లో నాటి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. భూములను అభివృద్ధి చేసే బాధ్యతలను నాటి ప్రభుత్వం తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు అప్పగించింది. 100 ఎకరాలను కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. అందులో ఐటీ హబ్ ఏర్పాటు చేయాలని వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్ రెడ్డి పావులు కదిపారు. ఇందుకు అనుగుణంగానే ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో 100 ఎకరాల్లో ఐటీ హబ్ వస్తుందని అందరూ భావించారు. భూసేకరణ బాధ్యతలనుంచి కార్పొరేషన్‌ను తప్పించిన రాష్ట్ర ప్రభుత్వం తుడాకు అప్పగించింది. దీంతో ఐటీ హబ్ లక్ష్యం నీరుగారడంతో పాటు కార్పొరేషన్‌కు ఏటా వచ్చే ఆదాయానికి రాష్ట్ర ప్రభుత్వం గండి కొట్టింది.

– వామపక్షాల పోరాట ఫలితమేనా!

గత కొన్నేళ్లుగా సీపీఎం, సీపీఐతో పాటు శెట్టిపల్లి భూముల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పోరాటాలు చేశారు. దీంతో ప్రభుత్వ దిగివచ్చి బాధితులకు 2 సెంట్లు వచ్చేలా కేబినెట్ దిగి వచ్చింది.

రాష్ట్రానికి డబుల్ డెక్కర్ బస్సు తీసుకొచ్చిన ఘనత అభినయ్‌దే..



మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి వాసుయాదవ్

తిరుపతి మంగళం : తిరుపతి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్‌గా ఉండి 40 ఏళ్ల రాజకీయ చరిత్రలో ఏ నాయకుడికి సాధ్యం కాని విధంగా 18 మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణంతో పాటు తిరుపతి ఆధ్యాత్మిక నగరానికి డబుల్ డెక్కర్ బస్సును మొదటిగా తీసుకొచ్చిన ఘనత భూమన అభినయ్‌రెడ్డిదేనని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి, టౌన్ బ్యాంక్ వైస్ చైర్మన్ వాసుయాదవ్ తెలిపారు. తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం మీడియాతో మాట్లాడారు. బాంబే తర్వాత డబుల్ డెక్కర్ బస్సును తిరుపతి నగరానికి 2023 సంవత్సరంలోనే భూమన అభినయ్‌రెడ్డి తీసుకొచ్చారన్నారు. ప్రపంచ నలుమూలల నుంచి శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులను సైతం కనువిందు చేసేలా డబుల్ డెక్కర్ బస్సు తిరుపతి పుర వీధుల్లో తిప్పారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.2.5 కోట్లను భూమన అభినయ్‌రెడ్డి దుర్వినియోగం చేశారంటూ పచ్చ పత్రికల్లో విషపు రాతలు రాశారన్నారు. ఆ తర్వాత డబుల్ డెక్కర్ బస్సును డంపింగ్ యార్డ్‌లోని చెత్త కుప్పల వద్ద కూటమి నేతలు పడేశారన్నారు. అప్పుడు తిరుపతికి శోభ రాలేదా? కూటమి నేతలు చేసింది పచ్చ పత్రికలకు కనపడలేదా? అని ప్రశ్నించారు. అయితే ఇప్పుడు వైజాగ్‌లో డబుల్ డెక్కర్ బస్సును చంద్రబాబు, లోకేష్ ప్రారంభిస్తే అదేదో పెద్ద గొప్ప అన్నట్లుగా వైజాగ్‌కు డబుల్ డెక్కర్ బస్సుతో కొత్త శోభ వచ్చిందని అదే పచ్చ పత్రికల్లో రాయడం వారి నీచపు రాతలకు నిదర్శనమన్నారు. ఎవ్వరు ఎన్ని మాట్లాడినా, పచ్చ పత్రికల్లో తప్పుడు కథనాలు రాసినా తిరుపతిని రాష్ట్రానికే ఆదర్శంగా అభివృద్ధి చేసిన ఘనత మాత్రం భూమన అభినయ్‌రెడ్డిదేననే విషయం అందరికీ తెలుసునన్నారు.

సిట్ విచారణకు అన్నివిధాలా సహకరించాం

- విచారణ జరగకనే ఏదేదో రాయడం బాధాకరం
- తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

తిరుపతి రూరల్: ''సిట్ అధికారులు అడిగిన అన్నింటికీ సమాధానం చెప్పాను. విచారణకు అన్నివిధాలుగా సహకరించాం.. ఇప్పుడే కాదు.. ఎప్పుడు విచారణకు పిలిచినా సహకరిస్తాం. దయచేసి పత్రికలు, టీవీ చానెళ్లలో జరగనది జరిగినట్టు అవాస్తవాలు ప్రచురించకండి. రాజకీయాల్లో మా నాన్న ఇరవై ఏళ్ల ప్రజలకు మంచిచేసి తెచ్చుకున్న పేరును చెరపాలని చూసినపుడు బాధ కలుగుతోంది.. దయచేసి అర్థం చేసుకోండి'' అంటూ తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి వెల్లడించారు. తుమ్మలగుంట గ్రామంలోని చెవిరెడ్డి ఇంటి వద్ద గురువారం జరిగిన సిట్, విజిలెన్స్ అధికారుల విచారణ ముగిసిన తరువాత చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. సిట్, విజిలెన్స్ అధికారులు బుధవారం తమ ఇంటికి వచ్చారని, వాళ్లు వస్తారన్న సమాచారం తమకు లేనందున ఆ సమయంలో ఇంటికి తాళం వేసుకుని తాము విజయవాడ కోర్టుకు వెళ్లామని చెప్పారు. గురువారం తాము ఇంటికి వచ్చిన కొద్ది సేపటికే సిట్ అధికారులు వచ్చారని, సెర్చ్ ప్రాసెస్ పూర్తిచేసుకుని తనను విచారించారని తెలిపారు. సిట్ అధికారులు అడిగిన అన్నింటికీ సమాధానం చెప్పానని, విచారణకు అన్ని విధాలుగా సహకరించినట్టు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి చెప్పారు.

ఆయన అన్ని విధాలుగా సహకరించారు

సిట్ అధికారులతో కలిసి తాము చేసిన విచారణకు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అన్ని విధాలుగా సహకరించారని విచారణ అధికారులతో కలిసి వచ్చిన తిరుపతి విజిలెన్స్ ఎస్పీ కరీముల్లా షరీఫ్ మీడియాకు వివరించారు. తాము అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పారని, వారి నుంచి స్టేట్మెంట్లు తీసుకుని వెళుతున్నామని తెలిపారు.

శ్రీకాళహస్తిలో వైభవంగా పవిత్రోత్సవాలు



పూజలు చేస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలను రెండవ రోజు గురువారం వైభవంగా నిర్వహించారు. నిత్య పూజల్లో జరిగే దోషాలను సరిచేసేందుకు ఈ పూజలు చేస్తారు. అందులో భాగంగా ఆలయంలోని యాగశాలలో వేదపండితులు, అర్చకుల ఆధ్వర్యంలో శ్రీ-కాళ-హస్తి, భరద్వాజ మహర్షికి పలు రకాల అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ అధికారులు పూజా ద్రవ్యాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు, అర్చకులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా వర్సిటీ అధ్యాపకులకు ఉత్తమ పురస్కారాలు



శారద, జ్యోత్స్న, అరుణ, రమ్యకుబేర్

తిరుపతి రూరల్ : తిరుపతి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయానికి చెందిన అయిదుగురు అధ్యాపకులు ఉత్తమ బోధకుల పురస్కారానికి ఎంపికయ్యారు. ప్రొఫెసర్ వెంకటకృష్ణ (ఎంసీఏ), ప్రొఫెసర్ వై.ఎస్. శారద (ఇంగ్లీష్), ప్రొఫెసర్ జోత్స్న (జీవ సాంకేతికశాస్త్రం), ప్రొఫెసర్ అరుణ (హోమ్ సైన్స్), ప్రొఫెసర్ రమ్య కుబేర్ (ఫార్మసీ) ఆ గౌరవాన్ని అందుకోనున్నారు. ఆ పురస్కారాన్ని ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విజయవాడలో సీఎం చంద్రబాబు చేతులు మీదుగా అందుకోనున్నారు. వీరి విజయం బోధన, పరిశోధన, విద్యార్థుల మార్గదర్శనంలో చేసిన విశిష్ట సేవలకు గుర్తింపు లభించినట్టు వీసీ ఆచార్య ఉమ అభినందించారు.

సుబ్రహ్మణ్యంకు ఉత్తమ పురస్కారం



సుబ్రమణ్యం

చంద్రగిరి : ఆచార్య ఎన్.జీ. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాలలోని అగ్రోనమీ విభాగం ప్రొఫెసర్ డా.డి.సుబ్రహ్మణ్యానికి ఉత్తమ అధ్యాపకుల పురస్కారం లభించింది. బోధన, పరిశోధన, విస్తరణ విభాగాలలో ఆయన చేసిన కృషికి గాను ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం విజయవాడలో జరిగే కార్యక్రమంలో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకోనున్నారు. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకులు, యూనివర్శిటీ అధికారులు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

దర్జాగా ప్రభుత్వ భూమి కబ్జా

- అటవీ భూమి నుంచి మట్టి అక్రమ రవాణా



ట్రాక్టర్‌తో అక్రమంగా మట్టి తోలుతున్న దృశ్యం

కలువాయి (సైదాపురం) : మండలంలోని వెంకటరెడ్డిపల్లి నేషనల్ హైవే ఆనుకొని జంక్షన్ వద్ద రూ.లక్షలు విలువ చేసే ప్రభుత్వ భూమిని కొందరు కూటమి నేతలు దర్జాగా కబ్జా చేశారు. కళ్ల ముందు ఫారెస్టు భూమి నుంచి అక్రమంగా గ్రావెల్ రవాణా చేస్తున్నా అటవీ అధికారులు కన్నెత్తి చూడని పరిస్థితి నెలకొంది. అక్రమంగా మట్టి రవాణా చేస్తున్నా.. ప్రభుత్వ భూములు ఆక్రమిస్తున్నా.. ఫారెస్టు, రెవెన్యూ అధికారులు మామూళ్ల మత్తులో ఉన్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు.

రూ.30 లక్షల విలువైన ప్రభుత్వ భూమి

ప్రభుత్వ భూములను కూటమి నాయకులు గద్దల్లా తన్నుకుపోతున్నారు. ఇటీవల కోటూరుపల్లి ప్రభుత్వ భూమి ఆక్రమించిన విషయాన్ని సాక్షి వెలుగులోకి తెచ్చింది. ఇప్పుడు తాజాగా నేషనల్ హైవే ఆనుకున్న ఉన్న భూమి ముందు ప్రభుత్వ భూమి అని, వెనుక పట్టా అని రెవెన్యూ అధికారులు కొత్త కథలు చెబుతున్నారు. రెవెన్యూ అధికారుల చేతివాటంతో రూ.30 లక్షలు విలువ చేసే ప్రభుత్వ భూమిని కూటమి నేతలు ఆక్రమిస్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

నేషనల్ హైవే అధికారుల నిర్లక్ష్యం

నేషనల్ హైవే అథారిటీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా హైవే జంక్షన్ వద్ద తూర్పు , పడమర 40 నుంచి 50 మీటర్లు విస్తీర్ణం కలిగి ఉండాలి. అటువంటి పరిస్థితుల్లో ఆ భూములకు నేషనల్ హైవే అథారిటీ పరిహారం ఇచ్చారు. ఆక్రమణదారులు దర్జాగా హైవే పక్కన భూములు ఆక్రమిస్తున్నా వీరికి తెలిసినా తెలియనట్లు వ్యవహరిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఈ విషయంపై ఇన్‌చార్జి తహశీల్దార్ వెంకటేశ్వర్లు వివరణ ఇస్తూ..వెంకటరెడ్డిపల్లి జంక్షన్ వద్ద నేషనల్ హైవే ఆనుకొని ఉన్న సర్వే నంబర్ 360 కొంత ప్రభుత్వ భూమి ఉన్న మాట వాస్తవమేన్నారు. ప్రభుత్వ భూమి వెనుక వైపు పట్టా భూమి అని తెలిపారు. ప్రభుత్వ భూమి ఉన్న ప్రాంతంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశామని చెప్పారు. మరి అక్రమంగా మట్టి తోలుతున్న విషయంపై చర్యలపై అడగగా సమాధానం దాటవేశారు.

శ్రీసిటీని సందర్శించిన విశాఖ సెజ్ జోనల్ డీసీ

శ్రీసిటీ (వరదయ్యపాళెం) : విశాఖపట్నం స్పెషల్ ఎకనామిక్ జోన్ (వీఎస్‌ఈజెడ్) జోనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ ముప్పళ్ల శ్రీనివాస్ గురువారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) సి.రమేష్ కుమార్ ఆయనకు స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, వేగవంతమైన పారిశ్రామిక ప్రగతి గురించి వివరించారు. చర్చల సందర్భంగా బలమైన జాతీయ, అంతర్జాతీయ వాణిజ్య సంబంధాలతో సెజ్, డీటీజెడ్ కార్యకలాపాలు, భారీ టర్నోవర్, ఎగుమతులతో ప్రధాన ఆర్థిక ఇంజిన్‌గా శ్రీసిటీ స్థిరమైన పురోగతిని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి హైలెట్ చేశారు. ఎగుమతులను ప్రోత్సహించాలనే కేంద్ర ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా, శ్రీసిటీలో ప్రత్యేక ఎగుమతుల సహాయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. శ్రీసిటీ పరిశ్రమలు ప్రపంచ మార్కెట్లో మరింత సమర్థవంతంగా పోటీ పడటానికి వీలు కల్పిస్తుందన్నారు. సింగిల్-విండో సదుపాయంగా ఎగుమతిదారులకు రియల్-టైమ్ విధాన నవీకరణలు, సహకారం, పరిశ్రమ-నిర్దిష్ట సవాళ్లకు ఆచరణాత్మక పరిష్కారాలను అందిస్తుంది' అని డాక్టర్ సన్నారెడ్డి పేర్కొన్నారు. సమావేశంలో విశాఖ సెజ్ ఏడీసీ ప్రసన్న కుమార్, ఎస్‌ఓ కిషోర్ కుమార్, శ్రీసిటీ సెజ్ ఏడీసీ రామ్మోహన్ చౌదరి తదితరులు పాల్గొన్నారు. పర్యటనలో భాగంగా శ్రీనివాస్ శ్రీసిటీ పరిసరాలతో పాటు ఆల్‌స్టామ్, ఎన్‌జీసీ ట్రాన్స్‌మిషన్, వెర్మొరియన్ పరిశ్రమలను సందర్శించారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు



పట్టుబడిన దొంగ, బైక్‌లతో పోలీసులు

రేణిగుంట : మూడు జిల్లాల్లో పదేళ్లుగా బైక్ దొంగతనాలు చేస్తూ 63 కేసుల్లో నిందితుడిగా ఉన్న నెల్లూరు జిల్లాకు చెందిన దొడ్డ సంతోష్‌ను రేణిగుంట అర్బన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అతడి వద్ద నుంచి 10 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అర్బన్ పోలీస్ స్టేషన్‌లో గురువారం డీఎస్పీ శ్రీనివాసరావు విలేకరుల సమావేశం నిర్వహించి కేసు వివరాలను వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న మోటార్ సైకిళ్లు రేణిగుంట, చంద్రగిరి, అలిపిరి, తిరుచానూరు, భాకరాపేట, నెల్లూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులకు సంబంధించినవిగా తెలిపారు. ఎక్కువగా బైక్ దొంగతనం కేసులు ప్రస్తుతం వివిధ కోర్టుల్లో విచారణలో ఉన్నాయని అన్నారు. అంతర్ జిల్లా దొంగను సీఐ జయచంద్ర ఆధ్వర్యంలో చాకచక్యంగా పట్టుకొని అరెస్టు చేసిన అర్బన్ పోలీసులను అభినందించారు. దొంగను అరెస్టు చేయడంలో ప్రతిభ కనబరిచిన సిబ్బందికి నగదు రివార్డును అందించారు. సమావేశంలో ఏర్పేడు సీఐ శ్రీకాంత్‌రెడ్డి, ఎస్‌ఐలు నాగరాజు, సుధాకర్, ట్రైనీ ఎస్‌ఐ స్వాతి, రాజశేఖర్, బారుషా, గౌరీ నాయుడు, శీను పాల్గొన్నారు.